సాక్షి
అనంతపురం

సోమవారం, 28, జూలై, 2025



ఇంజినీరింగ్‌తో బంగారు భవిత

ఇంజినీరింగ్‌తో బంగారు భవిష్యత్తు అందుకోవచ్చని ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ హేమచంద్రారెడ్డి అన్నారు.

8లో



టమాట కిలో రూ.37

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.37 పలికింది. కనిష్టం రూ.24, సరాసరి రూ.30 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

33.6°/22.8°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక



అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలని సూచించారు.

వేడి నీరు పడి చిన్నారి మృతి

అనంతపురం: వేడి నీరు శరీరంపై పడడంతో చిన్నారి మృతి చెందిన ఘటన నగరంలో విషాదం నింపింది. అనంతపురం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగరంలోని ఎస్కేడీ నగర్‌లో నివసిస్తున్న భాను, ఫయాజ్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు సంతానం. ఫయాజ్ కియా సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య క్యాటరింగ్ పనులకు వెళ్లేది. వీరు నివాసం ఉంటున్న ఇంటికి సమీపంలోనే రత్నమ్మ కుటుంబం ఉంటోంది. పనుల నిమిత్తం భార్యాభర్తలు బయటకు వెళ్లినప్పుడు రత్నమ్మ ఇంట్లో తమ రెండో కుమార్తె సాబియా (4)ను భాను, ఫయాజ్‌లు విడిచేవారు. శనివారం రాత్రి బాలిక అక్కడే నిద్రించింది. ఆదివారం ఉదయం రత్నమ్మ కుమారుడు పాత్రలో వేడి నీటిని బాత్రూంలోకి తీసుకెళ్తుండగా, పొరపాటున పాత్ర జారి అక్కడే ఉన్న చిన్నారి సాబియాపై పడింది. వేడి నీటికి సాబియా శరీరంపై బొబ్బలు వచ్చాయి. తక్షణమే ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కర్నూలుకు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే చిన్నారి మృతి చెందింది. గారాబంగా పెంచుకుంటున్న కుమార్తె మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

అందాల ‘నిధి’.. దోచెను మది



సినీ నటి నిధి అగర్వాల్ ఆదివారం అనంతపురం నగరంలో మెరిశారు. ఓ ప్రముఖ దుస్తుల దుకాణం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమెను చూసేందుకు అభిమానులు, నగరవాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

బాబోయ్.. భౌభౌ



- నాలుగు నెలల్లో 2,159 మందికి కుక్కకాటు
- జిల్లా వ్యాప్తంగా మునిసిపాలిటీలు, పంచాయతీల్లో 10 వేలకు పైగా కుక్కలు
- ఆగిపోయిన శునకాల స్టెరిలైజేషన్
- శునకాల గుంపులను చూస్తేనే బెంబేలెత్తుతున్న ప్రజలు
- నిద్రమత్తులో పాలకులు, జిల్లా అధికార యంత్రాంగం



ఈ ఫొటోలో కనిపిస్తున్న చిన్నారి పేరు రిచితా రెడ్డి. నార్పల మండలం జంగంరెడ్డి పల్లి గ్రామం. ఈ 21న తమ ఇంటి ముందు రిచితా రెడ్డి ఆడుకుంటూ ఉండగా అమాంతంగా ఓ వీధి కుక్క కుడి తొడను పట్టుకుంది. కుటుంబీకులు, చుట్టుపక్కల వారు గట్టిగా కేకలు వేయడంతో రిచితారెడ్డిని వదిలి పరుగులు పెట్టింది. తీవ్రంగా గాయపడ్డ రిచితా రెడ్డిని కుటుంబీకులు వెంటనే అనంతపురం తీసుకొచ్చి సర్వజనాస్పత్రిలో అడ్మిట్ చేశారు.



అనంతపురంలోని ఓ వీధిలో కుక్కల గుంపు



ఈ ఫొటోలో కన్పిస్తున్న చిన్నారి పేరు మెహతాజ్. యాడికి మండలం వేములపాడు గ్రామం. ఈ నెల 7న గ్రామంలో ఐదు కుక్కలు ఒకేసారి ఈ చిన్నారిపై దాడి చేశాయి. చిన్నారి ఒళ్లంతా కరిచేశాయి. ఈ క్రమంలో చుట్టుపక్కల వారు గట్టిగా అరవడంతో పాపను వదిలి పారిపోయాయి. కుటుంబీకులు సర్వజనాస్పత్రికి తీసుకురాగా.. చిన్నపిల్లల వార్డులో చిన్నారికి వైద్యులు చికిత్సనందించి డిశ్చార్జ్ చేశారు. ఇలా జిల్లాలో రోజూ ఏదో ఒక ప్రాంతంలో కుక్కకాట్లు నమోదవుతున్నాయి.

ఆగిపోయిన స్టెరిలైజేషన్..

అనంతపురం నగరంలో కుక్కల స్టెరిలైజేషన్ కాంట్రాక్ట్‌ను ఈ ఏడాది రాజస్థాన్‌కు చెందిన సంతూలన్ జీవన్ కళ్యాణ్ ఏజెన్సీకి నగరపాలక సంస్థ అప్పగించింది. ఒక్కో కుక్కకు స్టెరిలైజేషన్ చేయడానికి రూ.1,500 చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. కొన్ని నెలలు పాటు పని చేసిన ఏజెన్సీ సిబ్బంది తర్వాత ప్రక్రియను నిలిపేశారు. ప్రస్తుతం స్టెరిలైజేషన్ ప్రక్రియ జరగడం లేదు. దీంతో కుక్కల సంతతి పెరిగిపోతోంది. జిల్లాలోని మునిసిపాలిటీలు, పంచాయతీల్లో 10 వేలకు పైగా శునకాలు ఉన్నట్లు తెలుస్తోంది.

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. భౌభౌ మంటూ దాడికి దిగుతున్నాయి. సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో గత నాలుగు నెలల్లోనే 2 వేల మందికి పైగా కుక్కకాటు బాధితులు నమోదయ్యారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం కూడా తమకేమీ పట్టదన్న ధోరణిలో ఉండడంపై సామాన్యులు మండిపడుతున్నారు.

చిన్నారులపై విరుచుకుపడుతూ..

జిల్లాలో ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. అశక్త స్థితిలో ఉండే చిన్నారులపై ఎక్కువగా దాడి చేస్తున్నాయి. భయంతో పరుగులు తీస్తే మీదకు దూకి కరుస్తున్నాయి. రాప్తాడుకు చెందిన చిన్నారి దూదేకుల లిహాజ్‌పై గత నెలలో కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపరిచాయి. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అనంతపురం రూరల్ మండలం ఏ నారాయణపురం ప్రాంతంలో ఓ చిన్నారి ముఖంపై కుక్కలు దాడి చేయగా... బాధితురాలికి వైద్యులు ఇమినోగ్లోబిలిన్ ఇంజెక్షన్ ఇవ్వాల్సి వచ్చింది.

2,159 మంది కుక్కకాటు బాధితులు..

ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కొత్తగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ మొదటి డోస్‌ను 562, మేలో 631, జూన్‌లో 483, జులైలో ప్రస్తుత తేదీ వరకు 483 మంది వేసుకున్నారు. కేవలం నాలుగు నెలల్లోనే 2,159 మంది కుక్కకాటు బాధితులు నమోదు కావడం గమనార్హం. రోజూ 15 నుంచి 20 కేసులు సర్వజనాస్పత్రికి వస్తున్నాయి. తీవ్ర కేసులను వైద్యులు అడ్మిట్ చేసుకుంటున్నారు.

ప్రాణాంతకమే...

కుక్కకాటు ఒక పరిధి దాటాక ప్రాణాంతకంగా మారుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గతేడాది డిసెంబర్ 6న శింగనమల మండలం తరిమెలకు చెందిన ఓ వృద్ధుడికి కుక్క కరవడంతో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసుకోలేదు. ఈ క్రమంలో ఆయనకు రేబిస్ లక్షణాలు బయటపడ్డాయి. చివరకు ప్రభుత్వ సర్వజనాస్పత్రి వైద్యులు కర్నూలుకు కేసును రెఫర్ చేయాల్సి వచ్చింది.

తల్లిదండ్రులు మందలించారని బాలిక ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి శృతి


గుంతకల్లు: తరుచూ సెల్ ఫోన్ చూస్తుండటం, మాట్లాడుతుండటంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. గుంతకల్లు తిలక్‌నగర్‌లోని వేద ఆస్పత్రి వెనుక వీధిలో నివాసముంటున్న మోహన్, లక్ష్మీ దంపతులకు ఇద్దరు సంతానం. మోహన్ స్థానిక వాసవీ పైప్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆయన కుమార్తె శృతి (18) పట్టణంలోని శస్త్ర కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ బైపీసీ చదువుతుంది. కొన్ని రోజులుగా శృతి తరచూ సెల్‌ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతుండటంతో తల్లిదండ్రులు మందలించేవారు. ఆదివారం ఉదయం కూడా ఫోన్‌లో మాట్లాడుతున్న ఆమెను మందలించారు. అనంతరం భార్యాభర్తలిరువురు మార్కెట్‌కు వెళ్లారు. శృతి తమ్ముడు తన స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు.ఈ నేపథ్యంలోనే శృతి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. మార్కెట్ నుంచి ఇంటికి చేరుకున్న మోహన్, లక్ష్మీలు బిడ్డ ఉరికి వేలాడుతుండడం చూసి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి శృతిని కిందికి దింపారు. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

టీచర్ల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు: వైఎస్సార్‌టీఏ

అనంతపురం ఎడ్యుకేషన్: బదిలీ అయిన వేలాదిమంది టీచర్లకు రెండు నెలలవుతున్నా జీతాల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) నాయకులు వాపోయారు. ఈ మేరకు అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్‌గౌడ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ కేడర్‌స్ట్రెన్త్ అప్‌డేట్ చేయకుండా అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని జీతాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖరీఫ్ కల్లోలం

- 30 శాతం తక్కువగా వర్షపాతం
- 32 శాతం విస్తీర్ణంలోనే సాగులోకి పంటలు
- 40 వేల హెక్టార్ల కనిష్ట స్థాయికి వేరుశనగ



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖరీఫ్ కల్లోలంగా మారింది. వర్షాలు లేక ఏరువాక మందకొడిగా ‘సాగు’తోంది. జూన్ 15 నుంచి దాదాపు నెలన్నర రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో పదును వర్షం ఎక్కడా ఆశించిన స్థాయిలో నమోదు కాలేదు. తేలికపాటి వర్షాలకే పంటల సాగు కొనసాగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ‘ముంగారు’ మందగించడంతో అన్నదాత మరోసారి కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్నాడు. పరిస్థితి ఘోరంగా కనిపిస్తున్నా కూటమి సర్కారు మాత్రం ఎలాంటి సాయం చేయకుండా చేతులెత్తేస్తుండటంపై రైతుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఖరీఫ్ సాగు 32 శాతం..

వ్యవసాయశాఖ తాజా నివేదిక ప్రకారం 32 శాతం విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చాయి. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 3,43,232 హెక్టార్లు కాగా ప్రస్తుతానికి 1.08 లక్షల హెక్టార్లలో పంటలు వేశారు. నెలాఖరు నాటికి 1.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి రావచ్చని అధికారులు అంచనా వేశారు. అయినా ఇంకా 1.90 లక్షల హెక్టార్లు పంటలు లేక బీళ్లుగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, సజ్జ, కొర్ర లాంటి ప్రధాన పంటల సాగుకు ఈ నెలాఖరుతో గడువు ముగియనుండంతో రైతుల ఇంట ఆందోళన వ్యక్తమవుతోంది. ఆగస్టు, సెప్టెంబర్‌లో ప్రత్యామ్నాయమే శరణ్యమని చెబుతున్నారు. నెలాఖరు నాటికి 40 శాతం విస్తీర్ణంలో పంటలు వచ్చినా ఇంకా 60 శాతం మిగిలిపోనుందని అంచనా వేస్తున్నారు.


ముఖం చాటేసిన వరుణుడు..

‘నైరుతి’ ఈ సారి మే 26న ముందస్తుగా పలకరించి మురిపించినా... విత్తు సమయం వచ్చే సరికి వరుణుడు ముఖం చాటేయడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 15 నుంచి ఒక్క మంచి వర్షం కూడా నమోదు కాకపోవడం గమనార్హం. జూన్‌లో 61.2 మి.మీ గానూ 21.7 శాతం తక్కువగా 47.9 మి.మీ నమోదైంది. కీలకమైన జూలైలో 63.9 మి.మీ గానూ ప్రస్తుతానికి 37 శాతం తక్కువగా 35 మి.మీ నమోదైంది. జూన్, జూలైలో వరుణుడు కరుణించకపోవడంతో తేలికపాటి నడుమ పంటలు వేశారు. రెండు మండలాలు మినహా మిగతా అన్ని మండలాల్లోనూ సాధారణం కన్నా తక్కువగా వర్షాలు కురిశాయి.

40 వేల హెక్టార్లకు వేరుశనగ పరిమితం..

జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రధాన పంట వేరుశనగ ఈ సారి కేవలం 40 వేల హెక్టార్లకు పరిమితమైంది. సాధారణ విస్తీర్ణం 1.82 లక్షల హెక్టార్లు అంచనా వేయగా అందులో 22 శాతం విస్తీర్ణంలో మాత్రమే వేరుశనగ వేయడం గమనార్హం.అయితే కంది పంట సాధారణ సాగు విస్తీర్ణం 55,296 హెక్టార్లు కాగా ఇప్పటికే 75 శాతం విస్తీర్ణంతో 42 వేల హెక్టార్ల సాగుతో సాధారణానికి చేరువైంది. ప్రస్తుతం సజ్జ పంట మాత్రమే 2,054 హెక్టార్లకు గానూ 2 వేల హెక్టార్లలో వేశారు. ఇక పత్తి పరిస్థితి దారుణంగానే ఉంది. 44 వేల హెక్టార్లకు గానూ 28 శాతంతో 12 వేల హెక్టార్లలో పత్తి విత్తుకున్నారు. ఆముదం పంట 16,293 హెక్టార్లకు గానూ 30 శాతంతో 4,800 హెక్టార్లలో వేశారు. మొక్కజొన్న 14,653 హెక్టార్లకు గానూ 58 శాతంతో 8,500 హెక్టార్లలో వేశారు. మిగతా పంటలు నామమాత్రంగా సాగులోకి వచ్చాయి. ఓవరాల్‌గా కంది, సజ్జ మినహా మిగతా పంటల సాగు పూర్తిగా చతికిలపడింది. వర్షాభావం, విత్తన సమస్య, పెట్టుబడి భారం తదితర కారణాలతో చాలా మంది రైతులు వేరుశనగ సాగుపై అనాసక్తి ప్రదర్శించినట్లు స్పష్టమవుతోంది.

కళకళలాడుతున్న తుంగభద్రమ్మ



తుంగభద్ర డ్యాం నుంచి పరవళ్లు తొక్కుతూ నదికి పోతున్న నీరు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం కళకళలాడుతోంది. డ్యాంలోకి వరద నీటి చేరిక కొనసాగుతోంది. ఈ క్రమంలో డ్యాం 14 క్రస్ట్ గేట్ల 4 అడుగులు, 12 క్రస్ట్ గేట్లు 3 అడుగుల మేర పైకెత్తి 98,235 క్యూసెక్కులు నదికి, 13,583 వేల క్యూసెక్కులు వివిధ కాలువలకు మొత్తంగా 1,11,818 క్యూసెక్కుల నీటిని బయటికి వదులుతున్నారు. తుంగభద్రమ్మ కళకళలాడుతుండటంతో జిల్లాలోని ఆయకట్టు రైతులు ఆనందంలో మునిగిపోయారు. సకాలంలో పంటలను సాగు చేసుకునేందుకు ఉత్సాహంగా నాట్లు వేసుకుంటున్నారు. ప్రస్తుతం టీబీ జలాశయంలో 1,633 అడుగుల నీటి నిల్వ గాను 1,624.62 అడుగులకు నీరు చేరుకుంది. ఇన్‌ఫ్లో 82,874 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 1,11,818 క్యూసెక్కులుగా నమోదవుతోంది. మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 75.260 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కార్లు సరే.. కంతుల్లేవ్

ఫైనాన్స్ సంస్థల్లో కలవరం

- ఉమ్మడి జిల్లాలో భారీగా డిఫాల్టర్లు
- లోను తీసుకున్న మూణ్నెళ్లకే కారు కుదువకు
- అనంతపురంలో ఈఎంఐలు కట్టని వందల కార్లు స్వాధీనం
- ఏటా ఐదువేల కార్లకు లోన్లు ఇస్తున్న బ్యాంకింగ్, ఫైనాన్స్ సంస్థలు
- ఇందులో 15 శాతం ఎన్‌పీఏలుగా ఉన్నట్లు తాజా గణాంకాల్లో వెల్లడి
- కార్లకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జల్లెడ పడుతున్న రికవరీ ఏజెంట్లు



ఉమ్మడి జిల్లాలో కార్ల లోన్ల గణాంకాలు..

లోన్లు ఇచ్చే బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు	25 వరకు
ఒక్కో ఫైనాన్స్ సంస్థ ఏడాదికి లోన్లకు వ్యయం	రూ.40 కోట్లు
కార్ లోన్లకు సంస్థలు వెచ్చించే మొత్తం	రూ.800 కోట్లు
ఉమ్మడి జిల్లాలో ఏడాదికి కార్ల కొనుగోలు	6,000 వరకు
ఈఎంఐలు కట్టకపోవడంతో రికవరీకి వచ్చేవి	600 వరకు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆర్థిక స్థాయిని మించి కార్లు కొనుగోలు చేసిన వందలాది మంది నెలవారీ కంతులు కట్టలేక చతికిలపడుతున్నారు. ప్రతి వంద మందిలో పది నుంచి పదిహేను మంది డిఫాల్టర్‌గా మారుతున్న పరిస్థితి. ఈఎంఐలు సరిగా కట్టకపోవడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత ఏడాదిగా లోన్లు ఇచ్చిన బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు తలపట్టుకు కూర్చున్నాయి. ఎన్‌పీఏ (నాన్ పెర్ఫార్మెన్స్ అసెట్స్) సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటంతో బ్యాంకు సిబ్బందికి కంటిమీద కునుకులేకుండా పోతోంది. కారు తీసుకున్నప్పుడు సిబిల్ స్కోరు బాగానే ఉన్నా తర్వాత.. కంతుల చెల్లింపుల్లో దారుణంగా విఫలమవుతున్నట్టు బ్యాంకింగ్ సంస్థలు చెబుతున్నాయి.

అలా వాడి.. ఇలా కుదువకు..

కొంతమంది యువకులు కారు తీసుకుని రెండు మూడు నెలలు జల్సాగా తిరుగుతున్నారు. ఆ తర్వాత కారును తక్కువ రేటుకు ఇతరుల దగ్గర కుదువకు పెడుతున్నారు. ఆ డబ్బుతో జల్సా చేయడం, బెట్టింగ్‌లు, క్రికెట్ పందేలు ఇలా రకరకాలుగా వెచ్చించి పోగొట్టుకుంటున్నారు. రికవరీ ఏజెంట్లు కారు స్వాధీనానికి వెళ్లినప్పుడు కుదువ పెట్టుకుని డబ్బు ఇచ్చిన యజమాని అడ్డం తిరుగుతున్నారు. కొన్ని చోట్ల రాజకీయ బలాలు ఉపయోగిస్తున్నారు.

రికవరీ ఏజెంట్ల కళ్లు గప్పి..

కార్లు లేదా ద్విచక్రవాహనాలు తీసుకున్న తర్వాత వరుసగా మూడు మాసాలు ఈఎంఐలు (నెలవారీ కంతులు) చెల్లించకపోతే రెపో ఏజెంట్లు వాహనం స్వాధీనానికి వస్తారు. కానీ ఏజెంట్లు ఎంత వెతికినా కార్లు దాచేస్తున్నారు. తాము వస్తున్నామన్న విషయం తెలుసుకోగానే మరోచోటుకు తెలివిగా మారుస్తున్నట్టు ఏజెంట్లు చెబుతున్నారు. ఒక్కోసారి రికవరీకి వెళ్లినప్పుడు దాడికి యత్నించిన సందర్భాలూ ఉన్నాయని ఇండస్ ఇండ్ బ్యాంకు మేనేజర్ ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు.

రాజకీయ నేతలనూ ఆశ్రయిస్తున్నారు..

కంతులు చెల్లించకుండా ఉన్న కార్లను స్వాధీనం చేసుకోకుండా ఉండేందుకు కొంతమంది రాజకీయ నేతలనూ ఆశ్రయిస్తున్నారు. తాజాగా ఓ వ్యక్తి కారు తీసుకుని కంతులు కట్టలేదు. దీంతో రెపో ఏజెంట్లు రికవరీ కోసం వచ్చారు. అప్పటికే సదరు కారు యజమాని బత్తలపల్లిలోని టీడీపీ నాయకుడి ఇంట్లో వాహనం పెట్టారు. అక్కడకు ఏజెంట్లు వెళ్లగా మీకు చేతనైతే తీసుకెళ్లండంటూ టీడీపీ నేత బెదిరించారు. పోలీసులు కూడా చేతులెత్తేయడంతో వెనుదిరిగారు. ఇక కోర్టుకు వెళ్లడం తప్ప చేసేదేమీ లేదని నిట్టూరుస్తున్నారు.

క్లుప్తంగా

ఎంపీఆర్‌లోకి తుంగభద్ర జలాలు


మిడ్ పెన్నార్ రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్ల వద్ద ఉన్న మిడ్ పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్)లోకి తుంగభద్ర జలాలు చేరుతున్నాయి. దీంతో రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరుగుతోంది. ఆదివారం రిజర్వాయర్ ఏఈ సురేంద్ర మాట్లాడుతూ.. కణేకల్లు నుంచి మోపిడి కాలువ ద్వారా రోజూ 500 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.45 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లుగా తెలిపారు.

కుమార్తెలతో కలసి తండ్రి ఆత్మహత్యాయత్నం

బెళుగుప్ప: కుటుంబ కలహాల నేపథ్యంలో విసుగు చెందిన వ్యక్తి.. తన ఇద్దరు కుమార్తెలతో కలసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. బెళుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన రమేష్‌రెడ్డి, దివ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నపాటి విషయానికి ఆదివారం దంపతులు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన రమేష్‌రెడ్డి.. తన ఇద్దరు కుమార్తెలను వెంట బెట్టుకుని వ్యవసాయ తోటలోకి వెళ్లి విషపు గుళికలు తాను తిని, చిన్నారులకూ తినిపించాడు. కాసేపటి తర్వాత పిల్లలను పిలుచుకుని ఇంటికి చేరుకున్నాడు. విషయాన్ని తల్లికి చిన్నారులు తెలపడంతో కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. కాగా, ఆరేళ్ల వయసున్న కుముద్విని, మూడేళ్ల వయసున్న చైత్ర పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

తొలగని చుక్కలు.. రైతులకు చిక్కులు



కూటమి ప్రభుత్వంలో అన్నదాతలను కష్టాలు నీడలా వెన్నంటే ఉంటూ పీడిస్తున్నాయి. చంద్రబాబు పాలనలో ఏ విషయంలోనూ తాము సంతోషంగా లేమంటూ రైతులు వాపోతున్నారు. రైతులను ఇబ్బందికి గురిచేయడంలో మేమేమి తక్కువ కాదన్నట్లుగా ప్రభుత్వంతో జిల్లా యంత్రాంగం పోటీ పడుతోంది. ఫలితంగా రైతుల కష్టాలు రెట్టింపవుతున్నాయి.

- మొక్కుబడిగా చుక్కల భూముల ఫైళ్ల పరిష్కారం
- డీఎల్‌సీలో నాలుగైదుకు మించి పరిష్కారం కాని వైనం
- పెండింగ్‌లో 1,950కు పైగా ఫైళ్లు
- విముక్తి కోసం రైతుల ఎదురు చూపు

అనంతపురం అర్బన్: రైతులకు చుక్కల భూముల తిప్పలను తొలగించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. 'ఫైళ్ల బారెడు... పరిష్కారం మూరెడు' అన్నట్లుగా చుక్కల భూముల ఫైళ్ల పరిష్కార ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్రతి శుక్రవారం చుక్కల భూముల ఫైళ్లను పరిష్కరిస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నా.. ఆ సంఖ్య నాలుగైదుకు మించి ఉండడం లేదు. మరో వైపు చుక్కల భూములకు సంబంధించి 1,950కు పైగా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. చుక్కల జాబితా నుంచి తమ భూములకు విముక్తి ఎప్పుడు కల్పిస్తారోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

మొక్కుబడి తంతు..

చుక్కల భూములకు సంబంధించి అత్యధికంగా అనంతపురం డివిజన్‌లో బుక్కరాయసముద్రం, అనంతపురం రూరల్, శింగనమల మండలాలతో పాటు కళ్యాణదుర్గం డివిజన్‌లో కంబదూరు, కళ్యాణదుర్గం, బెళుగుప్ప మండలాల్లో సమస్యలు ఉన్నట్లు అధికారిక సమాచారం వెల్లడిస్తోంది. చుక్కలు భూములకు సంబంధించి 1,953 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి డీఎల్‌సీ సమావేశం నిర్వహించి ఒక్కసారిగా 150 నుంచి 200 వరకు ఫైళ్లకు పరిష్కారం చూపినట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుతం చుక్కల భూముల ఫైళ్ల పరిష్కార ప్రక్రియ మొక్కుబడి తంతుగా సాగుతోందనే విమర్శలు ఇటు రెవెన్యూవర్గాలు, అటు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

పెండింగ్ ఫైళ్లు ఇలా...

అనంతపురం డివిజన్	1,183
కళ్యాణదుర్గం డివిజన్	763
గుంతకల్లు డివిజన్	7
మొత్తం	1,953

ఆమోద ముద్రకు నిబంధనలిలా...

చుక్కల భూముల జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న వారికి నిబంధనల ప్రకారం డీఎల్‌సీ ఆమోద ముద్ర తప్పనిసరి. ఆమోదం పొందేందుకు ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది.

- సాగు చేస్తున్నట్లుగా పేర్కొన్న ప్రభుత్వ భూమి వివరాలు ఆర్ఎస్ఆర్‌లో చుక్కలుగా ఉండాలి. ఆ భూమి ఎవరి పేరునా అసైన్ చేసి ఉండకూడదు.
- డాటెడ్ ల్యాండ్ చట్టం-2017 ప్రకారం... ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న వ్యక్తి.. చట్టం వచ్చిన 12 ఏళ్లకు ముందే ఆ భూమిపై సాగు హక్కు, అనుభవం కలిగి ఉండాలి.
- చట్టం నిబంధనల ప్రకారం సాగు చేస్తున్న వారు తహసీల్దారు వద్ద దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై సమగ్ర విచారణ అనంతరం ఆర్‌డీఓకు తహసీల్దారు నివేదిస్తారు. దీని ఆధారంగా ఆర్‌డీఓ విచారణ చేసి కలెక్టర్ కార్యాలయానికి సిఫారసు చేస్తారు.
- ఆర్డీఓ సిఫారసులను కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి కమిటీ విచారణ చేసి నిబంధనల ప్రకారం అన్ని సక్రమంగా ఉన్నవాటిని జాబితా నుంచి తొలగిస్తూ అమోద ముద్ర వేస్తారు.

అప్పుల ఊబిలో రాష్ట్రం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం


విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం అర్బన్: సీఎం చంద్రబాబు ఏడాది పాలనలో రాష్ట్రం రూ.1.50 లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. అనంతపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్‌తో కలసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రమూ చేయనన్ని అప్పులు ఆంధ్రప్రదేశ్ చేస్తోందన్నారు. అమరావతి పేరుతో రూ.31 వేలు కోట్లు అప్పు తెచ్చారన్నారు. మరో రూ.31 వేల కోట్ల అప్పు చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. చంద్రబాబు ఢిల్లీ, సింగపూర్ పర్యటనల వల్ల రాష్ట్రానికి మేలు జరగకపోగా.. అప్పుల భారం మరింత పెరుగుతోందన్నారు. 21సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లి రాష్ట్రానికి ఏమి సాధించారో చెప్పాలని సీఎం చంద్రబాబును డిమాండ్ చేశారు. పోలవరం ఎత్తు తగ్గించినా నోరుమెదపలేకపోయారని ఎద్దేవా చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు సహకరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ఆరు నెలల్లోనే రూ.15,480 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. సమావేశంలో సీపీఐ ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్యయాదవ్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, కార్యదర్శివర్గ సభ్యుడు రాజారెడ్డి, నగర కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు.

మహిళ దుర్మరణం




మసీదా బేగం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి, తదితరులు

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనంపై నుంచి అదుపు తప్పి కిందపడిన ఘటనలో గుమ్మఘట్ట మండల కో–ఆప్షన్ సభ్యుడు హిదతుల్లా తల్లి మసీదా బేగం (55) దుర్మరణం పాలయ్యారు. స్థానికులు తెలిపిన మేరకు.. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం తన మనవడితో కలసి ద్విచక్ర వాహనంపై కణేకల్లులో ఉన్న కుమార్తెను చూసి వచ్చేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలో రాయదుర్గం మండలం కదరంపల్లి వద్దకు చేరుకోగానే మసీదాబేగం చీర కొంగు వాహనం చక్కానికి చుట్టుకోవడంతో అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆ గ్రామానికి చేరుకుని మసీదా బేగం మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వెం మున్సిపల్ మాజీ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతరెడ్డి, కాంట్రాక్టర్ ఆర్టీ లక్ష్మీకాంతారెడ్డి, హేమారెడ్డి, స్వామి, చమ్మా ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

ఇంజినీరింగ్‌తో బంగారు భవిష్యత్తు




సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ హేమచంద్రారెడ్డి (చిత్రంలో) ఆలూరి సాంబశివారెడ్డి, కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

- ఎస్ఆర్ఐటీ స్నాతకోత్సవంలో ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్‌తో బంగారు భవిష్యత్తు ఉంటుందని ఏపీ ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఆచార్య డాక్టర్ హేమచంద్రారెడ్డి అన్నారు. బీకేఎస్ మండలం రోటరీపురం సమీపంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల 3వ స్నాతకోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ హేమచంద్రారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ చదవడానికి ముందు మంచి కళాశాల ఎంపిక ముఖ్యమన్నారు. నాలుగేళ్ల పాటు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే నాలుగు దశాబ్దాల పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 3వ స్నాతకోత్సవం జరుపుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంగా తాను, తన భార్య జొన్నలగడ్డ పద్మావతి 2008లో ఈ కళాశాలను స్థాపించినట్లు గుర్తు చేశారు. దినదినాభివృద్ధి చెందుతూ నాణ్యతా ప్రమాణాలతో అటానమస్ హోదా దక్కించుకుందన్నారు. కళాశాలలో బీటెక్ పూర్తి చేసుకున్న 620 మందికి ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వీరిలో 430 మందికి దేశంలోనే ప్రముఖ కంపెనీల్లో రూ.4 లక్షల నుంచి రూ.9లక్షల వరకు ప్యాకేజీతో ఉద్యోగాలు దక్కాయన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ(ఏ) ప్రతనిధి వేణుగోపాలరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాన కురవక.. ఆశ చావక

పెద్దవడుగూరు మండలంలోని పెద్దవడుగూరు, లక్ష్ముంపల్లి, దిమ్మగుడి, చిన్నవడుగూరు గ్రామాల్లో చాలామంది రైతులు పత్తి, కొర్ర తదితర పంటలు సాగు చేశారు. అయితే, సరిగ్గా మొక్కలు మొలకెత్తాక వానలు కరువయ్యాయి. ఇటీవల మేఘాలు ఊరిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. దీంతో పంట ఎండుముఖం పట్టింది. వేల రూపాయలు ఖర్చు చేసి పెట్టిన పంట ఎండిపోతుండడాన్ని రైతులు తట్టుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు ఎలాగైనా పంటను బతికించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనంలో బిందెలతో నీటిని తీసుకెళ్లి మొక్కలకు పోస్తున్నారు. లక్ష్ముంపల్లి గ్రామం వద్ద ఓబుళరెడ్డి అనే రైతు తన పొలంలోని పత్తి మొక్కలకు నీటిని పోయిస్తుండగా తీసిన చిత్రమిది. – పెద్దవడుగూరు


మొక్కలకు నీళ్లు పోస్తున్న దృశ్యం

12వ పీఆర్సీని నియమించాలి

- యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్


మాట్లాడుతున్న సురేష్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: పంట్రెండవ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ను వెంటనే ఏర్పాటు చేయాలని, అలాగే మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతాన్ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో 'స్టడీ సర్కిల్ వర్క్‌షాపు' ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఏడాదవుతున్న వారి సమస్యలు పరిష్కరించకుండా అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్‌లు, రిటైర్డ్ అయిన వారికి అందాల్సిన రూ. 20 వేల కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీచర్లను బోధనేతర పనులకు ఉపయోగించుకోబోమని చెబుతూనే మరోవైపు రకరకాల యాప్‌లు, వివిధ రకాల శిక్షణలు, ఇతర కార్యక్రమాలతో మానసిక క్షోభకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, నాయకులు రామప్ప, రాఘవేంద్ర, హనుమంతరెడ్డి, ప్రమీల, రవికుమార్, అబ్దుల్ వహాబ్‌ఖాన్, సంజీవకుమార్, శేఖర్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు రవిచంద్ర

బుక్కరాయసముద్రం: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో అనంతపురం – తాడిపత్రి రహదారిపై శనివారం అర్ధరాత్రి నడుచుకుంటూ వెళుతున్న యువకుడిని వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడిని అటుగా వెళుతున్న వారు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఉదయం మృతి చెందాడు. కాగా, మరణానికి ముందు తన పేరు రవిచంద్ర అని, రాయదుర్గం పట్టణ వాసిగా ఆయన పేర్కొన్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వేడుకగా చందన షాపింగ్ మాల్ ప్రారంభం

- సందడి చేసిన నిధి అగర్వాల్


మాల్‌ను ప్రారంభిస్తున్న నిధి అగర్వాల్ (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని సూర్యనగర్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చందన షాపింగ్ మాల్‌ను ఆదివారం సినీనటి నిధి అగర్వాల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చందన షాపింగ్ మాల్‌లో మెన్స్, ఉమెన్స్, కిడ్స్ వస్త్రాలు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. వస్త్ర వ్యాపారంలో వినియోగదారులతో చందన షాపింగ్ మాల్‌కు 40 ఏళ్ల అనుబంధముందన్నారు. ఈ క్రమంలో సరికొత్త రూపంలో చందన షాపింగ్ మాల్‌ను అనంతపురానికి తీసుకువచ్చామన్నారు. సొంత మగ్గాలతో నేయించిన చీరలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రారంభం సందర్భంగా కొనుగోలుదారులకు ఆఫర్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక చీర కొంటే మరో చీరపై 99 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, నిర్వాహకులు ఎంపీ సంతోష్ రాంమోహన్, ఎంపీ గణేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మాల్ ప్రారంభానికి విచ్చేసిన నిధి అగర్వాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సినీ పాటలకు స్టెప్పులు వేసి ప్రజలను అలరించారు.

కొమ్మకొమ్మకూ గూడు






అందమైన ప్రకృతి రమణీయతలకు నెలవుగా నిలిచిన పెనకచెర్ల డ్యామ్ వద్ద పక్షి గూళ్లు ఆకట్టుకుంటున్నాయి. కిలకిల రావాలతో ఆహ్లాదాన్ని పంచే గిజిగాడు పక్షి తన పిల్లలను, గుడ్లను కాపాడుకునేందుకు ముళ్ల చెట్ల, నీటి వనరులకు దగ్గరలో ఉండే చెట్ల కొమ్మలకు కిందకు వేలాడేలా కట్టుకున్న గూళ్లు వాటి నైపుణ్యానికి అద్దం పడుతున్నాయి. ఒక్కొక్క గడ్డి పోచను తీసుకువచ్చి అల్లుకున్న గూడులో దాని అద్భుతమైన నైపుణ్యం కనిపిస్తుంది. మగ పక్షి మాత్రమే ఇలా గూడును అల్లే నైపుణ్యం, నేర్పు కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే అరుదైన బార్న్ స్వాలో పక్షులు మట్టితో మోరీల కింద నిర్మించిన గూళ్లు అబ్బురపరుస్తున్నాయి. ప్రకృతిలో ప్రతీది ఓ అద్భుతమేనంటూ చాటిచెబుతున్న బర్డ్ ఆర్కిటెక్ట్‌ను పరిశీలించాలంటే ఒకసారి పెనకచెర్ల డ్యామ్‌ను సందర్శించి తీరాల్సిందే. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


ప్రకృతి సోయగాలు

ఉరవకొండ: హెచ్చెల్సీకి తుంగభద్ర జలాలు విడుదల కావడంతో ఎంపీఆర్ లింక్ చానల్ నుంచి 500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. పెన్నహోబిలం క్షేత్రం మీదుగా ఈ నీరు ఎంపీఆర్‌కు చేరుతోంది. దీంతో పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం ప్రకృతి సోయగాలతో కనువిందు చేస్తోంది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పెన్నహోబిలం క్షేత్రానికి వస్తున్న భక్తులు ఇక్కడి సెలయేళ్లలో సరదాగా గడుపుతున్నారు. వనభోజనాలతో సందడి చేస్తున్నారు.


కనువిందు చేస్తున్న జలపాతం


పెన్నహోబిలంలోని ఆలయం


ప్రత్యేక ఆకర్షణగా ఉగ్రనరసింహుడి విగ్రహం


ఉద్భవలక్ష్మి ఆలయానికి చేరువలో ఆహ్లాదాన్ని పంచుతున్న సెలయేరు

క్లుప్తంగా

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడాలని విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంత రావు అన్నారు. ఆదివారం స్థానిక విశ్వకర్మ కళ్యాణ మండపంలో బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా చూస్తున్నాయని మండిపడ్డారు. బీసీలకు రాజ్యాధికారం కల్పించలేదన్నారు. ఇప్పటికైనా బీసీలందరూ ఏకమై రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బీసీ కులాలకు చట్ట సభల్లో అవకాశాలు కల్పించలేదన్నారు. అన్ని పార్టీలు బీసీల వైపు చూసేలా మనం సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో సాంబ శివరావు, నాగరాజు, హరి, వెంకటేష్, బాల, పుల్లయ్య, వంశరాజు, శ్రీనివాసులు, శ్రీరాములు, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదికకు స్పందన

అనంతపురం టవర్‌క్లాక్: బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివాహ పరిచయ వేదికను బెస్త కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ సూచించారు. ఆదివారం జిల్లా బెస్త సేవాసంఘం ఆధ్వర్యంలో ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ.. వివాహ పరిచయ వేదికకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, చెన్నై నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. బెస్త కులస్తుల సంక్షేమానికి అందరూ సహకరించాలని కోరారు. 105 మందికి పైగా వధూవరులు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ జడ్జి సత్యవాణి, నెల్లూరు జిల్లా వినియోగదారుల ఫోరం జడ్జి రెడ్డి శేఖర్, బెస్త సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, బంగారు కవచ అలంకరణ, ఆకుపూజ, అలంకరణ, అర్చన, మహానైవేద్యం, పల్లకీ సేవ, కాలసర్ప నివారణ దోష హోమాలు చేపట్టారు. మహామంగళ హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సోమవారం నాగుల చవితి సందర్భంగా సర్ప సూక్త పారాయణం, క్షీరాభిషేకం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

పార్వతమ్మ సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు వీకే ఆదినారాయణరెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ కమ్యూనిస్టు పార్టీకి అందించిన సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక వీకే మెమోరియల్ హాల్‌లో వీకే పార్వతమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరై మాట్లాడారు. పార్వతమ్మ 1926లో శింగనమల మండలం తరిమెల గ్రామంలో జన్మించారన్నారు. 1947లో వీకే ఆదినారాయణరెడ్డితో వివాహం అనంతరం భర్తతో కలిసి కమ్యూనిస్టు ఉద్యమంలో మమేకమైనట్లు తెలిపారు. ఉద్యమ నాయకులు, కార్యకర్తలకు ఆశ్రయం ఇచ్చి తన ఇంటిని శిక్షణ కేంద్రంగా మార్చారన్నారు. జై ఆంధ్ర ఉద్యమంలో జరిగిన రాళ్లదాడిలో ధైర్యంగా నిలబడి పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆమె ఆశయ స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, నాయకుడు శ్రీనివాసులు నాయుడు, సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శులు జాఫర్, నల్లప్ప, ప్రభాకర్‌రెడ్డి, సీపీఐఎంఎల్ ఎన్‌డీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బెల్టు షాపుపై దాడులు

పుట్లూరు: శనగలగూడూరులో ఆదివారం బెల్టు షాపులపై దాడులు చేసినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహ తెలిపారు. సీఐ సత్యబాబు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో రఘు అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 90 బాటిళ్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



రాజు రోడ్డులో నీటి కనెక్షన్ కోసం గుంత తవ్విన దృశ్యం

తవ్వేశారు.. వదిలేశారు

నగరపాలక సంస్థ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యానికి ఈ ఫొటో నిలువెత్తు సాక్ష్యం. నగరపాలక సంస్థకు కూత వేటు దూరం.. నగరం నడిబొడ్డున ఉండే సప్తగిరి సర్కిల్ రాజు రోడ్డులో వైశ్య హాస్టల్ వద్ద ఓ అనధికార నిర్మాణం జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుండడంతో పాటు నీటి కనెక్షన్ కోసం 20 అడుగుల వరకు రోడ్డుకు అడ్డంగా తవ్వేశారు. కనీసం గుంతనైనా పూడ్చారా అంటే అదీ లేదు. సుభాష్ రోడ్డు మీదుగా రాజు రోడ్డుకు టర్నింగ్ చేసుకునే ప్రాంతంలో రోడ్డు ధ్వంసం కావడంతో వాహనదారులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. వేగంగా వచ్చిన వారు కిందకు పడి గాయాలపాలవుతున్నారు. కనీసం నిర్మాణాలు జరిగే సమయంలో టీపీఓ, రోడ్డుకు కోత వేసే సమయంలో ఈఈలు అటువైపు చూసిన పరిస్థితులు లేవు. వీరి నిర్లక్ష్యం నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మేల్కొని చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి. – అనంతపురం కార్పొరేషన్:



పైపు ద్వారా నీరు పట్టుకుంటున్న మహిళలు

సిద్ధరాంపురంలో దాహం కేకలు

ఆత్మకూరు మండలం పి.సిద్ధరాంపురం గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. నాలుగు రోజులుగా నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో మూడు పంచాయతీ బోర్లు ఉండగా.. రెండు మరమ్మతులకు గురయ్యాయి. కేవలం ఒక్క బోరులోనే నీరు వస్తుండటంలో ప్రజలకు సరిపోవడం లేదు. నీటి కోసం మహిళలు పడరాని పాట్లు పడుతున్నారు. అంతేకాకుండా చాలా మంది ద్విచక్ర వాహనాలపై పొలాల్లోకి వెళ్లి బిందెలతో నీరు తెచ్చుకుంటున్నారు. ఒక్క బోరు నుంచి నీరు రావడంతో పైపులు వేసుకుని నీరు పట్టుకుంటున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – ఆత్మకూరు:

కమనీయం.. రుక్మిణీ కల్యాణం



రుక్మిణీ కల్యాణం తిలకిస్తున్న మహిళలు



హారతి ఇస్తున్న అర్చకుడు

అనంతపురం కల్చరల్: స్థానిక హౌసింగ్ బోర్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఆదివారం రుక్మిణీ కల్యాణం కమనీయంగా సాగింది. సాయిట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నజీయర్ స్వామిజీ శిష్యుడు మాధవాచార్యుల బృందం కల్యాణంలోని సకల ఘట్టాలను సంప్రదాయరీతిలో జరిపించారు. స్వామి ఆత్మవిదానంద సరస్వతి కల్యాణోత్సవ ప్రాశస్త్యాన్ని వివరించారు. సంప్రదాయంగా అవివాహితుల కోసం రుక్మిణీ కల్యాణం జరిపించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వ్యక్తిగతంగా ఇబ్బంది పడకుండా అందరి తరపున రెండోసారి రుక్మిణీ కల్యాణోత్సవాన్ని సాయిట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర, నాట్యాచార్యులు సంధ్యామూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం



ప్రజలతో మాట్లాడుతున్న పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్



బాబు మోసాలను వివరిస్తున్న అనంత చంద్రారెడ్డి, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం ఆదివారం జిల్లా కేంద్రంలో జోరుగా సాగింది. నగరంలోని 10, 24, 25, 29, 31, 48, 49, 50, డివిజన్లలో జరిగిన కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనంతపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అదే విధంగా ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ఇచ్చిన సూపర్ సిక్స్‌తో పాటు వందకుపైగా హామీలకు సంబంధించిన కరపత్రాన్ని ప్రజలకు చూపించారు. సీఎం చంద్రబాబు నాయుడుకు మోసం చేయడం వెన్నతోపెట్టిన విద్య అని నాయకులు ధ్వజమెత్తారు. తల్లికి వందనం పూర్తీ స్థాయిలో రాలేదని నాయకులు చెప్పగా.. అందుకు అధిక సంఖ్యలో ప్రజల నుంచి నిజమేనని తెలియజేశారు. పింఛన్‌లోనూ కోత విధించారని పలువురు పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని నాయకులు తెలిపారు. ఏదైనా సమస్య వస్తే తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, సైఫుల్లాబేగ్, చింతా సోమశేఖర్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, ఓబిరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రారెడ్డి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, రియాజ్, సూర్యనారాయణ రెడ్డి, నారాయణ రెడ్డి, జావెద్, జగదీష్, రమణా రెడ్డి, జయరాం నాయక్, గౌస్‌బేగ్, మారుతీ నాయుడు, పెన్నోబులేసు, కొర్రపాడు హుస్సేన్ పీరా భారతి, భాను, శివ, దాదాఖలందర్, వినీత్, కార్పొరేటర్లు గురుశేఖర్ బాబు, లక్ష్మీదేవి, సుమతి, దేవి, సంపంగి రామాంజనేయులు, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి ప్రదాయకం.. సర్ప స్వరూపం

- నేటి నుంచి నాగుల చవితి వేడుకలు



నాగుల విగ్రహాల వద్ద మహిళల సందడి (ఫైల్)

అనంతపురం కల్చరల్: నాగుల చవితి రాకతో శ్రావణ మాసంలో ప్రధాన పండుగలు ప్రారంభం కానున్నాయి. సోమవారం నాగుల చవితి పర్వదినం, మంగళవారం గరుడ పంచమి వేడుకలకు నగరమంతటా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సాధారణంగా అన్ని పండుగలు ఒకటి రెండు రోజుల్లో ముగిసిపోతాయి. అయితే నాగుల చవితి వేడుకలు మాత్రం మాసమంతటా జరుపుకుంటూనే ఉంటారు. ముఖ్యంగా శ్రావణ మంగళ, శనివారాలు చవితి వేడుకలను తలపిస్తూనే సాగుతాయి. వయస్సుతో తారతమ్యం లేకుండా అందరూ నాగుల పుట్టల వద్ద పాలు, పండ్లు పోసే సంప్రదాయంగా కొనసాగుతోంది. పుట్ట మన్ను శరీర భాగాలకు పూసుకుంటే ఆరోగ్యకరమని అందరూ భావిస్తారు. నగరంలోని పలుచోట్ల నాగుల పుట్టలు ఇప్పటికే వేడుకలు జరుపుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నాగిన్ ఉత్సవం 'అనంత' ప్రత్యేకం

నగరానికి చెందిన కరణం వెంకట ప్రసాద్ రెవెన్యూ శాఖలో వీఏఓగా పనిచేస్తున్నారు. ప్రవృత్తిరీత్యా నాగులపై పరిశోధనలు చేస్తూ పుస్తకాలను రచిస్తుంటారు. ఈ నేపథ్యంలో పన్నేండేళ్ల కిందట పెద్ద కళా ఉత్సవంగా మార్చే వేడుకగా నాగుల చవితిని నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రాచీన కళాకారులు కళాజాతను ప్రదర్శిస్తూ నాగుల విశిష్టతను తెలియజేస్తుంటారు. ఇదే క్రమంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్థానిక తపోవనంలోని జగదీశ్వరాలయంలో వేడుకలు జరుగనున్నాయి. నాగుల విశిష్టతను తెలియజేస్తూ సాంస్కృతిక ఉత్సవాలు, భక్తిభావాన్ని నింపుతూ సామూహిక లలితా సహస్రనామ పారాయణం, శాస్త్రీయ నాట్యాల ప్రదర్శన నిర్వహించనున్నారు. వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు స్వామి ఆత్మవిదానంద సరస్వతి, నాగిని ప్రసాద్ కోరారు.

పూర్వ విద్యార్థుల సందడి



సమావేశమైన లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో 1996–97 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత కలుసుకుని ఒకరినొకరు క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వారందరూ ఒకచోట కలుసుకోవడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన టీచర్లను ఘనంగా సన్మానించారు.

ఆకట్టుకున్న సినీ గీతాలహరి



పాటలు పాడుతున్న గాయకులు

అనంతపురం కల్చరల్: తెలుగు సినీ సంగీత లోకానికి చిరస్థాయి గుర్తింపు తెచ్చిన అలనాటి అందాల నటి బి.సరోజా దేవి స్మారక గీతాలతో కళాకారులు శ్రోతలను అలరించారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని ఘంటసాల స్మారక మందిరంలో ఆదివారం సాయంత్రం పాత పాటల ప్రేమికుల సమూహం ఆధ్వర్యంలో సినీ గీతాలహరి కార్యక్రమం నిర్వహించారు. ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యంతో పాటూ హిందీ గాయనీ గాయకులు పాడిన ఆనాటి మధుర గీతాలతో ఆకట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన గానవర్షిణి కల్యాణి దేశ్‌పాండే పాటలతో అలరించారు. డీఆర్వో మలోల, సంస్థ నిర్వాహకులు ఓబుళదాసు, జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, జీవీ రామయ్య, ఆచార్య సుధాకరబాబు, విజయలక్ష్మి, బృంద, శ్రీదేవి, జీవన్, చరణ్ తదితరులు ఇటీవల మరణించిన బి.సరోజా దేవి గొప్పతనాన్ని తెలియజేస్తూ నీరాజనాలర్పించారు.

ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం.. అంధకారంలో గ్రామాలు



రాప్తాడులో రాత్రి 9 గంటల ప్రాంతంలో అంధకారం

రాప్తాడు: మండల వ్యాప్తంగా హంపాపురం, మరూరు, గాండ్లపర్తి సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది. శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం నుంచి హంపాపురం సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతుంది. అక్కడి నుంచి మరూరు, గాండ్లపర్తి సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా కావాల్సి ఉంది. అయితే ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ధర్మవరం సబ్‌స్టేషన్‌లో జంపర్ కట్ కావడంతో జంపర్‌కు ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేశారు. ధర్మవరం నుంచి 33 కేవీ లైన్ ద్వారా హంపాపురం సబ్‌స్టేషన్‌కు విద్యుత్ రావాల్సి ఉంది. ధర్మవరం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు పూర్తి చేసినా మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల సమీపంలో 33 కేవీ లైన్ ఒక విద్యుత్ పోల్ మీద ఉన్న ఇన్సులేటర్ (పింగాణి) మరమ్మతులకు గురి కావడంతో విద్యుత్ సమస్య తలెత్తింది. ఆదివారం 2 గంటల నుంచి విద్యుత్ లేకపోవడం, ఇన్సులేటర్‌ను తెప్పించి బిగించడంలో ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక పక్క ఆదివారం కావడంతో ఉద్యోగస్తులు, ప్రజలు ఇంటి దగ్గరే ఉన్నారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 9 గంటలు అయినా కరెంట్ రాలేదు. ఒక పక్క కరెంట్ లేకపోవడం, మరో పక్క దోమలు దాడితో ప్రజల బాధలు వర్ణనాతీతం. ఈ సమస్యపై విద్యుత్ శాఖ ఏఈని ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

బ్రాహ్మణులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: బ్రాహ్మణులు శాఖా బేధాలు మరచి సంఘటితం అయినప్పుడే మళ్లీ పూర్వ వైభవం వస్తుందని వక్తలు అన్నారు. రాయలసీమ బ్రాహ్మణ సేవా సమాఖ్య వారి ఆధ్వర్యంలో ఆదివారం బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక జరిగింది. స్థానిక శారదా నగర్‌లోని శ్రీశృంగేరీ శారదాపీఠంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జోస్యుల సదానంద శాస్త్రి, డాక్టర్ పాణ్యం వసుంధర, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, డాక్టర్ సత్యరంగారావు, విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ సీవీ మురళీధర్ తదితరులు మాట్లాడారు. దూరాభారంగా ఉంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో బ్రాహ్మణ వివాహాలు కష్టతరంగా మారిపోతున్నాయన్నారు. ఇటువంటి వివాహ పరిచయ వేదికలు ఎంతో మందిని ఏకం చేస్తుండటం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా తరలి వచ్చిన వధూవరులు సంబంధాలను కుదుర్చుకున్నారు. వధూవరుల వివరాలతో కూడిన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య నిర్వాహకులు నగరగేరి మల్లికార్జున, సుజాత, రామసుబ్బారావు, రవీంద్ర, డాక్టర్ గొల్లాపిన్ని సీతారాం, మాడుగుల రామమోహన్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేతగా అనంతపురం జట్టు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని ఏఎల్‌సీఎం గ్రౌండ్‌లో అంతర్ జిల్లా స్థాయి అండర్–15 జూనియర్ బాలికల విభాగం ఫుట్‌బాల్ విజేతగా అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి 9 జోన్ల పరిధిలోని 15కు పైగా జట్లు టోర్నీలోపాల్గొన్నాయి. ఆదివారం అనంతపురం, వైఎస్సార్ కడప జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. విన్నర్స్‌గా అనంతపురం, రన్నర్స్‌గా వైఎస్సార్ కడప జిల్లా జట్లు నిలిచాయి. పొట్టి శ్రీరాములు నెల్లూరు జట్టు మూడో స్థానంలో నిలిచింది. గెలుపొందిన జట్లకు ట్రోఫీలు అందజేశారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, ఫుట్ బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ రెడ్డప్ప, చర్చి పీసీసీ చైర్మన్ కారల్ మధు, బీజే ప్రసాద్, కళాచంద్, ఆనంద్, ఎస్‌ఎఫ్‌సీకు చెందిన కాళహస్తి భావిన్ అనుదీప్, టైసన్, రాఖీ, ఏలిష, సిరాజ్, భాను విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి గౌడ ఉద్యోగుల అండ



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నర్సింగ్ విద్యార్థినికి గౌడ (ఈడిగ) ఉద్యోగుల సంఘం అండగా నిలిచింది. ఆదివారం స్థానిక అనంతపురం రూరల్ మండలం రాయల్ నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ కళ్యాణ మంటపంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. నర్సింగ్ చదువుతున్న పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని లావణ్యకు తోటి ఉద్యోగులు, కులస్తుల సహకారంతో రూ.60 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గౌడ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి మనోహర్ గౌడ్, గౌరవాధ్యక్షులు శంకర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి నాగభూషణ, నాయకులు నారాయణ స్వామి, ఈడిగ సంఘం నాయకులు వేణుగోపాల్ గౌడ్, సూరి బాబు, జగదీష్, తుమ్మల నారాయణస్వామి, వెంకటేష్, లాల్‌బాబు, విజయ కుమార్ పాల్గొన్నారు.

యాచకుడి మృతదేహానికి అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్: అనారోగ్యంతో బాధపడుతూ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మృతి చెందిన గుర్తు తెలియని ఓ యాచకుడి మృతదేహానికి ఆ నలుగురు సేవా సమితి సభ్యులు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. టూటౌన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు అనాథ మృతదేహాన్ని పాతగుంతకల్లులోని హిందూ శ్మశానవాటికలో ఖననం చేశారు. కార్యక్రమంలో ఆ నలుగురు సేవాసమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సభ్యులు చక్రపాణి, కేశవ, రత్న, రవీంద్ర, రాము, ఆటోవేణు, నవీన్, అంజి పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

గుత్తి: కోట వీధిలో శనివారం అర్ధరాత్రి మిద్దెపైనుంచి పడి లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. యాడికికి చెందిన అతడు కోటలోని బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభ కార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. రాత్రి మిద్దెపై నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో మూత్ర విసర్జన కోసం మిద్దె దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించారు.

మట్కా బీటర్ల అరెస్టు



మట్కా బీటర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

తాడిపత్రి రూరల్: మండలంలోని అర్డీటీ కాలనీలో మట్కా రాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.40,200 నగదు స్వాధీనం చేసుకున్నామని ఆదివారం అప్‌గ్రేడ్ ఎస్‌ఐ ధరణిబాబు తెలిపారు. అందిన సమాచారం మేరకు పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన చెన్నప్పనాయక్, టైలర్స్‌కాలనీలోని పాండురంగడును అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు అధ్వానం..
ప్రయాణం నరకం



రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత



రోడ్డుపై నీరు నిలవడంతో ఇబ్బందులు పడుతున్న వాహనాదారులు

రాప్తాడు: మండలంలోని కందుకూరు రోడ్డు సమీపంలో ఎస్‌కేయూ రహదారి పరిస్థితి దారుణంగా తయారైంది. ఎస్‌కేయూకు వెళ్లే దారి బురదమయం మారడంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాప్తాడు నుంచి ఎస్‌కేయూకు వెళ్లాలంటే పండమేరు రేల్వే బ్రిడ్జి పక్కనే ఉన్న రస్తా మీదుగా ఎస్‌కేయూకు రోజూ వందలాది లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు నిత్యం తిరుగుతూ ఉంటాయి. అయితే ఈ రోడ్డును అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అధ్వాన స్థితికి చేరుకుంది.

దిగబడిపోతున్న వాహనాలు..

ఎవరైనా కొత్త వారు తెలియక ఈ రోడ్డులో ప్రయాణిస్తే అంతే సంగతులు. గుంతల్లో వర్షపు నీరు నిలబడి ఉండటంతో వాహనాలు గుంతల్లో ఇరుక్కుపోతున్నాయి. రాప్తాడు నుంచి పలు పాఠశాలలకు తమ పిల్లలను ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తీసుకెళుతున్న తల్లిదండ్రులు గుంతల దారులతో అవస్థలు పడుతున్నారు. పెద్ద గుంతల్లో రాకపోకలు సాగిస్తుండటంతో వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.